ప్రజాశక్తి

ఆదివారం 20 నవంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

చెంచు గిరిజనుల
సమస్యలు పరిష్కరిస్తాం..

- అధికారుల నుండి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

చెంచు గిరిజనులకు ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చింతల చెంచుగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ పేద గిరిజనులు అని చిన్నచూపు చూడకుండా ప్రతి సంక్షేమ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేద ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమ న్నారు. చెంచులకు అధికారుల నుండి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు భరోసా లాంటి పథకాలు అందేలా చూస్తామన్నారు. చింతల, తుమ్మల పాలెం, మర్రిపాలెం పేద ప్రజలకు త్రీపేస్ విద్యుత్ కనెక్షన్ కావాలని.. అప్పటికప్పుడే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తాగునీరు, నివేశనా స్థలాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చెంచులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రతి అధికారీ చర్యలు తీసు కుంటారన్నారు. సమస్యలను తీర్చని అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా చెంచు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా పలువురు జీవనోపాధి కోసం సహాయం కోరగా వారికి ఐటిడిఎ ఆధ్వర్యంలో సహాయం అందేందుకు నిధులు మంజూరు చేయించారు. పలువురు ఉపాధిహామీ, జనరల్ ఉపాధి కాకుండా ఐటిడిఎ తరపున ఉపాధిహామీ కావాలని కోరగా ఈ విషయంపై పరిశీలించి.. న్యాయం చేస్తామన్నారు. పలు సిసి రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఓ మురళీధరన్, పంచాయతీరాజ్ డిఇ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రామకృష్ణ, విద్యుత్‌శాఖ ఎడి సియానాయక్, డిఎల్‌పిఓ సాయికుమార్, సర్పంచి వెంకటయ్య, వైసిపి మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, వైసిపి నాయకులు ఎల్లేష్, మాజీ జడ్‌పిటిసి అమిరెడ్డి రామిరెడ్డి, గంటా గురువారెడ్డి, అల్లు ఆంజనేయరెడ్డి, ఎంపిడిఓ నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన నివాసగృహంలో కాసా రఘునాథరెడ్డి కుమార్తె సుహాసినికి రూ.2.80 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. కాసా రఘునాథరెడ్డి సంవత్సరం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన కుమార్తెకు సిఎం ఆర్‌ఎఫ్ చెక్కును ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి అమిరెడ్డి రామిరెడ్డి, వైసిపి నాయకులు గంటా గురువారెడ్డి, కాసా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భైరవకోనలో కలెక్టర్ల ప్రత్యేక పూజలు

సాగర్ ఆయకట్టులో
తగ్గిన పంటల విస్తీర్ణం



- నీటి సరఫరాపై అవాంతరాలు..
- ధాన్యంకు ధర లేకపోవడమే కారణం
- గతేడాది 2 లక్షల ఎకరాలకు పైగా సాగు తగ్గుదల
- ఈ ఏడాదీ ఇదే పరిస్థితి..
- పంటలపై సమగ్ర ప్రణాళికలే కీలకం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సాగర్ ఆయకట్టులో పంటల విస్తీర్ణం తగ్గుతోంది. రెండేళ్ల నుంచీ చూస్తే సాగు ప్రశ్నార్థకంగా మారింది. పదేళ్ల క్రితం చివరి భూముల సమస్యతో నీరు అందక రైతులు రోడ్లెక్కారు. ఇరిగేషన్ శాఖ ఆ సమస్యను పరిష్కారం చేయడంలో విఫలమవుతూనే ఉంది. ఎగువ ప్రాంతంలో రైతులు ఇష్టానుసారంగా నీటిని వాడుకోవడం.. దిగువకు రాకపోవడంతో ఈ సమస్య సాగర్ కాలువలకు నీటిని విడుదల చేసిన ఆరంభం నుంచే మొదలైంది. 1980 దశకం నుంచే చివరి భూములకు నీటి సమస్య మొదలైంది. 2000 సంవత్సరం నాటికి తీవ్రమైంది. రైతులు విసుగెత్తిపోయారు. సుమారు 70 వేల ఎకరాలకు నీరందక ఆరుతడి పంటలతో పాటు సామాజికవనాలకు వెళ్లారు.

ఇప్పుడు మాగాణి సాగుపైనే రైతుల్లో సందిగ్ధం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం మొదలైన క్రాప్‌హాలిడే ప్రభావం ఇప్పటికీ ఉంది. ధాన్యం సాగుపైనే రైతుల్లో అయోమయం నెలకొంది. ఒక వైపు బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నా ధాన్యం ధరలు మాత్రం ఆ స్థాయిలో పెరగడం లేదు. కనీస మద్దతు ధరలు లేవు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించినా నెలల తరబడి డబ్బులు ఇవ్వడం లేదు. భరోసా కేంద్రాలపైనా ఆశలు పోయాయి. అయితే గతేడాది సాగర్ ఆయకట్టులో సాగు గణనీయంగా తగ్గింది. నీరు ఉన్నా ఈ పరిస్థితి వచ్చింది. కారణాలు ఏమిటన్న దానిపైనా వ్యవసాయశాఖ గానీ, ఇరిగేషన్ శాఖ గానీ అధ్యయనం చేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా రైతులు సాగుపైనే ఆశలు వదులుకుంటున్నారు. ధరల్లేక పోవడం, సకాలంలో నీటి సరఫరాపై నిర్ణయాలు లేకపోవడంతో చాలావరకూ భూముల్లో సాగు చేయడం లేదు. ఏదో వర్షాధారిత పంటలు వేయడం వల్ల అరకొరగానే పంటలు పండుతున్నాయి. రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదు. దీంతో ఎక్కువ శాతం రైతులు భూములను కౌలుకు ఇచ్చేస్తున్నారు. ఈ తరహా మార్పులు కూడా పెరిగాయి. ఇప్పుడు సాగర్ ఆయకట్టులోనే చూస్తే అద్దంకి, చీమకుర్తి, దర్శి ఇరిగేషన్ డివిజన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్ల పరిధిలో మాగాణి 1,85,046 ఎకరాలు ఆరుతడి పంటలు 2,49,283 ఎకరాలు కలిపి 4,34,330 ఎకరాల సాధారణ ఆయకట్టు ఉంది. గతేడాది ఖరీఫ్‌లో (లేట్ ఖరీఫ్) సాగు చూస్తే 2,39,376 ఎకరాల్లో సాగయింది. ఇందులో మాగాణి 80,837 ఎకరాలు, ఆరుతడి పంటలు 1,78,539 ఎకరాల్లో సాగయింది. 52.70 టిఎంసీల నీటిని వ్యవసాయానికి వాడినట్లు ఇరిగేషన్ అధికారులు నివేదికల్లో వెల్లడించారు. ఇక ఈ ఏడాది ఇప్పటివరకూ సాగు చూస్తే 4.34 లక్షల సాధారణ విస్తీర్ణానికి గానూ ఇప్పటివరకూ మాగాణి 48654 ఎకరాల్లో సాగవ్వగా.. ఆరుతడి పంటలు 53 వేల ఎకరాల్లో సాగయ్యాయి. మాగాణి నాట్లు వేశారు. అయితే దర్శి ప్రాంతంలో ఇప్పటికే వేసిన నాట్లకు నీరందక ఎండిపోతున్నాయి. రైతులు గగ్గోలు పెడుతున్నారు. సాగునీరు ఎగువనే ఎక్కువగా వాడుతున్నారు. ఆరంభంలోనే ఇలాంటి సంఘటనలు కొనసాగుతున్నాయి. సాగర్ ఆయకట్టులో ఇప్పటివరకూ 25 శాతం విస్తీర్ణం మించి సాగు ▶ 2లో

అద్దెకున్నవారే..
అంతమొందించారా.?

- మహిళ హత్య కేసు విచారణ వేగవంతం
- ముగ్గురు యువకులపై అనుమానం
- వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

చిల్లర దొంగ ద్వారా వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

శింగరాయకొండ పట్టణంలో గురువారం రాత్రి జరిగిన పులిబండ్ల నారాయణమ్మ హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసులో ఆ ఇంట్లో అద్దెకున్న వారిపై పోలీసులకు అనుమానం వచ్చి.. ఆ వైపుగా విచారణ చేస్తున్నారు. ముగ్గురు యువకులను గుర్తించి.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌పి మల్లికాగర్గ్ ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావును, ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజును పూర్తిస్థాయిలో రంగంలోకి దించారు.

శింగరాయకొండలో పులిబండ్ల నారాయణమ్మ ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు గురువారం సాయంత్రం సమయంలో ఆమెను హత్య చేసి.. ఆమె వద్ద ఉన్న బంగారాన్ని ముక్కు పుడకతో సహా దోచుకుపోయారు. విషయం తెలుసుకున్న సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఫిరోజా ఫాతిమా సిబ్బందితో 24 గంటల పాటు ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టారు. పోలీసు నిఘా వర్గాలు సైతం ఆ ప్రాంతమంతా కలియ తిరిగారు. శనివారం ఉదయం ఓ యువకుడు దొంగతనం కోసం కందుకూర్ రోడ్డులోని పాత కార్పొరేషన్ బ్యాంక్ వెనుక ఓ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ యువకుడు తాను చిల్లర దొంగనని, తన కంటే పెద్ద దొంగలు ఉన్నారని అక్కడ ఉన్నవారిని బెదిరించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఫిరోజా ఫాతిమా అక్కడకు చేరుకున్నారు. ఆ యువకుడ్ని చూస్తే పాత చిల్లర ▶ 2లో

టిడిపి కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు

మాతృమూర్తికి అశ్రునివాళి

ప్రేమ ఆప్యాయతానురాగాలకు మారుపేరైనా మా తల్లిగారైన కీ॥శే॥ పత్తిపాటి కమలమ్మ గారి మరణం మాకు తీరని లోటు...
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...

కీ॥శే॥ పత్తిపాటి కమలమ్మ గారు
W/o పత్తిపాటి చలమయ్య గారు, ఒంగోలు
మరణం: 6-11-2022

కుమారుడు:
పత్తిపాటి రామమూర్తి
కుమార్తెలు అడ్వకేట్
పత్తిపాటి పద్మావతి
పత్తిపాటి సీతాలక్ష్మి
పత్తిపాటి లలితమ్మ
మరియు
కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది: 20-11-2022న ఆదివారం. ఒంగోలు, అంజయ్యరోడ్డు, ఆంధ్రకేసరి కాలేజి ఎదురు గల ఆరామక్షేత్రములో జరుగును. కావున తెలియజేయడమైనది

సాగర్ ఆయకట్టులో

తగ్గిన పంటల విస్తీర్ణం

(మొదటిపేజీ తరువాయి)

కాలేదు. అప్పుడే సాగునీటి సమస్య ఉత్పన్నమైంది. ఈ కారణాలతోనే సాగు ముందుకు సాగడం లేదు. కనీసం సాధారణ విస్తీర్ణం మేరకు కూడా సాగు పూర్తి కావడం లేదు. ఆరుతడి పంటల విషయానికి వస్తే కూరగాయలతో పాటు పత్తి, మిర్చి వంటివి ఎక్కువగా సాగుచేస్తున్నారు. వీటిని సకాలంలో నీరు అందడం లేదు. కాలువకు నీటి సరఫరా సక్రమంగా కొనసాగడం లేదు. ఒకవైపు డ్యాములు నిండి నీరు సముద్రంలో కలుస్తుంటే ఇక్కడ పంటలకు మాత్రం నీరందడం లేదు. సాగర్ కాలువలకు ఏళ్ల తరబడి మరమ్మతులు లేవు. నీటిని విడుదల చేసే సమయంలో పూడికల పేరుతో పనులు చేపట్టి అరకొరగా చేసి కోట్లాది రూపాయల బిల్లులు చేసుకుంటున్నారు. మూడేళ్ల నుంచి ఈ పనులు కూడా కనిపించడంలేదు. సాగర్ కాలువలపై పరిశీలన చేస్తే షట్టర్లు, డ్యాములు అన్నీ దెబ్బతినిపోయాయి. బ్రిడ్జీలు దెబ్బతిన్నాయి. గేట్లు వద్ద నిర్మాణాలు దెబ్బతిన్నాయి. చిన్నచిన్న కాలువలు చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదు. చివరి భూముల్లో ఉన్న చిన్నచిన్న మైనర్లు ఆక్రమణల్లో పోయాయి. రైతులు వాటిని దున్నేసుకున్నారు. కాలువలు కనిపించడం లేదు. ఈ కారణాల రీత్యా చివరిభూముల్లో నీరు లేక సాగు ఆగిపోయింది. సాగర్ ఆయకట్టులోనే సుబాబుల్ సాగు చేస్తున్నారు. సాగర్ కాలువలపై కోట్లు ఖర్చుపెట్టినా రైతులకు మాత్రం ఉపయోగపడటం లేదు. నిర్వహణ పేరుతో కేటాయించే నిధులదీ అదే పరిస్థితి. ప్రారంభంలో ఉన్న సిబ్బంది కూడా ఇప్పుడు లేరు. దర్శి, చీమకుర్తి, ముండ్లమూరు, కురిచేడు. త్రిపురాంతకం ప్రాంతాల్లో సాగర్ కాలువల సిబ్బంది కోసం పెద్ద పెద్ద కాలనీలు ఉన్నాయి. అవన్నీ ఇప్పుడు శిథిలమైపోయాయి. సిబ్బంది లేకపోవడంతో చాలావరకూ కూలిపోగా కొన్ని చోట్ల ఇతరులు ఉంటున్నారు. ఇలా సాగర్ కాలువల నిర్వహణ గాలికి వదిలేశారు. నిర్వహణ ప్రభావం సాగుపై పడుతోంది. నీటి సరఫరా సక్రమంగా లేక సకాలంలో పంటలకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. నీటి కోసం ఆందోళనలు తప్పడం లేదు. ఇప్పటికైనా సాగునీటి వ్యవస్థపై సమగ్రమైన దృష్టి సారించి.. కనీసం ఉన్న విస్తీర్ణంలోనైనా సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

అద్దెకున్నవారే..

అంతమొందించారా.?

(మొదటిపేజీ తరువాయి)

నేరస్తుడే.. అయితే యువకుడు చెప్పిన మాటలకు, పులిబండ్ల నారాయణమ్మ హత్య కేసుకు ఎక్కడో సంబంధం ఉందని అనుమానం వచ్చిన ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించడం మొదలుపెట్టారు. ఆ యువకుడి వద్ద కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకొని హత్య కేసు విచారణలో మరింత వేగం పెంచారు. ఒంగోలు డిఎస్పి యు.నాగరాజు, సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సైలు ఫిరోజా ఫాతిమా, ఖాదర్‌బాషా, కె.వెంకటేశ్వర్లుతో డిఎస్పి సమావేశమై విచారణ మొదలుపెట్టారు. ఆ విచారణలో మతురాలు నారాయణమ్మ గహంలోనే అద్దెకు ఉంటున్న ఓ కుటుంబంపై అనుమానాలు వచ్చాయి. శనివారం చిల్లర దొంగ ఇచ్చిన సమాచారంతో రంగంలో దిగిన పోలీసులకు ఆ ఇంట్లో అద్దెకున్న వారిపై అనుమానం మరింత బలపడింది. గతంలో అద్దె కొన్న వారిని కూడా విచారిస్తున్నారు. ఆ గృహానికి బేల్దారు పనికి వచ్చిన వారిని సైతం విచారణ చేస్తున్నారు. అద్దెంట్లో ఉంటున్న వారిలో ఒకరు హత్య జరిగిన రోజు రాత్రి నుంచే కనిపించడం లేదు. ఆ యువకుడితో పాటు పక్క నగర్‌లో ఉంటున్న మరో ఇద్దరు యువకులను కూడా అనుమానించారు. ఆ యువకులు కూడా ఆ రోజు నుంచి అక్కడ లేకపోవడంతో పోలీసులు అనుమానం మరింత బలపడింది. ప్రస్తుతం ఆ ముగ్గురు యువకుల కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఇటు చెన్నై వైపు, అటు హైదరాబాద్ వైపు వెళ్లి ఉంటారనే అనుమానంతో బృందాలు గాలిస్తున్నాయి.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్

మాట్లాడుతున్న వినోద్

ప్రజాశక్తి-కనిగిరి

దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ అన్నారు. శనివారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యా ర్థులతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నలుగురికి వినికిడి యంత్రాలు అందజేత

వినికిడి యంత్రాలు అందజేస్తున్న వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని పలు గ్రామాలలో వినికిడి సమస్యతో బాధపడుతున్న నలుగురు బాధితులకు కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, కందు లూరు నాయకులు మన్నం వెంకయ్య పంపిణీ చేశారు. శనివారం స్థానిక కొండపి రోడ్డులోని అశోక్‌బాబు కార్యాలయంలో బాధిత లకు వినికిడి మిషన్లను అందజేశారు. మండ లంలోని కందులూరు, కారు మంచి గ్రామాలకు చెందిన డి వెంక టేశ్వర్లు, షేక్ మస్తానీలతో పాటు టంగు టూరులోని నూతలపాటి లాస్య, జెటి. వెంకటేశ్వర్లులకు వినికిడి యంత్రాలను మన్నం వెంకయ్య, తదితర నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, నవులూరి సురేంద్ర, పసుమర్తి రాజేష్, ఆనంద్, మధు తదితరులు ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

కనిగిరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏఎంసీ చైర్మన్ వై సరిత, మున్సిపల్ వైస్ చైర్మన్ పులిశాంతి, హెచ్ఎంపాడు ఎస్ఐ జి కృష్ణపావనిలు అన్నారు. కనిగిరి పట్టణంలోని గౌతం కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురష్కరించుకొని గ్రంథపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశచట్టం, మహిళాసాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దిశచట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుమ, కరస్పాండెంట్ బిజేవి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

యర్రగొండపాలెం : మండల కేంద్రమైన పుల్లలచెరువులోని శనివారం కేజీబీవీ విద్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ కెవి సుబ్బమ్మ పాల్గొని మాట్లాడుతూ 21ఏళ్లు దాటిన తర్వాతే బాలికలకు వివాహాలు జరిపించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలుగు నష్టాలపై వ్యాస రచన నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ నర్రా శివలక్ష్మి, కెజిబివి ప్రిన్సిపల్ లిల్లీ ప్రకాష వాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదారవాద విధానాలతో ఉపాధికి గండి: సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని, ఉద్యోగాలు లేక నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు వై సిద్దయ్య తెలిపారు. సిపిఎం నగర పార్టీ కార్యకర్తల శిక్షణా తరగతులు శనివారంస్థానిక సుందరయ్య భవన్‌లో దామా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగాయి. ఈ తరగతుల్లో పాల్గొన్న సిద్దయ్య ' నయా ఉదారవాద విధానాలు– వివిధ తరగతులపైన ప్రభావం 'అనే అంశంపై బోధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు పార్టీ కార్యక్రమం అంశాలను బోధించారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి జి రమేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు

ముగిసిన జగనన్న క్రీడా సంబరాలు

యర్రగొండపాలెం :యర్రగొండపాలెం నియోజకర్గ స్థాయిలో రెండు రోజులుగా జరుగుతున్న జగనన్న క్రీడా సంబరాలు శనివారం ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న సిఎం కప్ ప్రైజ్ మని గేమ్స్ సెలక్షన్స్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 48 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంఇవో పి ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ జాన్, బ్రహ్మయ్య హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో యర్రగొండపాలెం పేరు నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, హునే నాయక్, రామ మోహన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్ : కెనరా బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో వైద్యశిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. 22 మంది బ్యాంక్ సిబ్బంది రక్తదానం చేశారు. బ్యాంక్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి సమగ్ర విద్యాకేం ద్రంలో 32 మంది ఎస్సీ, ఎస్టీ బాలికలకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను అంద జేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ బి.ఎన్.మారుతీ శశిధర్ మాట్లాడుతూ ఆనంద్ మినీ స్టేడియంలో వంద మొక్కలు నాటేందుకు సహకరించిన డిఆర్‌డిఎ పీడీ బాబూరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ దీప్తిస్ కుమార్‌దాస్, అరీఫ్ మహమ్మద్, ఎల్‌డిఎం యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కిన బియ్యాన్ని పరిశీలిస్తున్న పెద్దబ్బాయి

గొర్రెల యజమానులకు నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

ముక్కిన బియ్యం తిని చనిపోయిన గొర్రెల యజమానులకు నష్టపరిహారం ఇవ్వాలని గొర్రెల, మేకలపెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయ్, జిల్లా కార్యదర్శి తోటా తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఇటీవల గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోకి మేతకు వెళ్లి.. హనుమాన్ రైస్‌మిల్లు ప్రహరీ గోడ పక్కన ఉన్న విషపూరిత బియ్యం తిని 12 గొర్రెలు చనిపోయాయి. బియ్యం ఉన్న ప్రాంతాన్ని పెద్దబ్బాయి, తిరుపతిరావు పరిశీలించారు. ఇప్పటికైనా బియ్యాన్ని తొలగించాలని, చనిపోయిన గొర్రెలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గొర్రెల యజమాని, బూరేపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన నాగయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

మహారాజ శ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS.NO.194/2022.

మరియు

I.A. NO.500/2022

in 0.S.NO. 194/2022

బిట్వీన్–
నందూరి బేబీరాణి .... పిటీషనర్ /వాది
V/s
నందూరి శ్రీకాంత్ మరియు ఇంకొకరు
....రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

TO
నందూరి శ్రీకాంత్ S/o ఏడుకొండలు
వయస్సు 34 సం.లు, హిందూ, వ్యాపారం,
Door No 24- 139 A, కబేళా రోడ్డు భాష్యం స్కూలు ఎదురు చీరాల మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలో వాది పరిహార నిమిత్తం దావా O.S.NO.194/ 2022 మరియు I. A.No. 500/ 2022 దాఖలు చేయగా శ్రీకోర్టువారు దావాసమన్లు మరియు నోటీసును ఆర్డరు చేయగా నీవు దావా సమన్లు మరియు నోటీసులు ఎన్ని పర్యాయములు మీకు పంపి యున్నను నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావనియు, కావున శ్రీకోర్టు వారు నీకు నోటీసు మరియు సమన్లు పత్రికా ప్రకటన ద్వారా జారీ చేయుటకు ఉత్తర్వులుజారీ చేసి యున్నారనియు, కావున నీవు ది **:23-11-22 ఉదయం గం-10-30 ని.లకు** శ్రీకోర్టువారి ఎదుట స్వయంగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకోగలవనియు, లేనియెడల నీ పరోక్ష మందు దావాను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది .

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చీరాల : 19-11-2022

వాది తరుపు అడ్వకేట్స్
K.S.S.ప్రసాద్,M.A., LL.M.,
M. రవికుమార్ MA, B.Ed., LL.B,
చీరాల - 523156.
Cell No:900090016.

మహారాజశ్రీ ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

HMOP No : 24 /2020

Between :
కుంచాల వెంకట రావు ..... **పిటీషనరు**
మరియు
కుంచాల సంగీత ..... **రెస్పాండెట్**
To
కుంచాల సంగీత, భర్త : కుంచాల వెంకట రావు, తల్లి : తన్నీరు రమణమ్మ, నివాసం : డి.నెం.121, బి.సి. కాలనీ, తూర్పుపాలెం, కందుకూరు మున్సిపాలిటీ, కందుకూరు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా - 523105.

పై నెంబరు కేసులో పిటీషనరు విడాకులు కోరుచూ పైన తెలిపిన కోర్టులో పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనరు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచుండుట చేత మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయుటకు గాను ది.23.12.2022 తేదీకి వాయిదా వేసినారు.

కావున మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10.30ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల మీ పరోక్షం నందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

స్థలం : ఒంగోలు **తేది : 18-11-2022**

ఇట్లు
లింగాల కోటేశ్వరరావు, B.A. BL
అడ్వకేట్
కోర్టువీధి, జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు - 523 001.
ప్రకాశం జిల్లా. ఫోన్ : 94404 27689

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్ 208/2021

ఏలూరి కొండారెడ్డి ......వాది
వర్సెస్
కందగట్ల చిన్న నారాయణ ...... ప్రతివాది

టు,
కందగట్ల చిన్న నారాయణ
తండ్రి: నారాయణ,
సాయిబాబా గుడి దగ్గర, ఆర్‌టిసి డిపో వెనుక,
మార్కాపురం టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావా వాది ప్రామిసరి నోటు పరిహారం కోరుతూ పై నెంబరు దావాను నీ పైన దాఖలు చేసియున్నాడు. నీకు సమన్లు ముట్టని కారణంచే నీవు హాజరగు నిమిత్తం కోర్టు వారు 28-11-2022వ తేదీకి వాయిదా వేసినారు. ఇందు విషయమై నీకు ఆక్షేపణలు ఉన్నయెడల 28-11-2022వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు గానీ, నీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

(కోర్టు వారి అనుమతితో)

వాయిదా: 28-11-2022

కడియం రామయ్య
నరాల లక్ష్మి,
అడ్వకేట్స్, మార్కాపురం
సెల్: 9291205335.

ఎక్స్‌ప్రెస్ వే భూసేకరణ పట్ల రైతుల అసంతృప్తి

ప్రజాశక్తి-పంగులూరు

బెంగళూరు టు విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం శనివారం అధికారులు చేపట్టిన భూసేకరణ కార్యక్రమం పట్ల రైతులు అసంతప్తిగా ఉన్నారు. అధికారులు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం, రైతులకు నష్టపరిహారం ఇస్తామని, అధికారులు చెబుతున్నా అందులో రైతులకు న్యాయం జరిగే విధానం కనిపించడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. బెంగళూరు కడప విజయవాడ రోడ్డులో అద్దంకి నుంచి పంగులూరు మండల పరిధిలోని కస్యాపురం, జాగర్లమూడి వారి పాలెం, ముప్పవరం, గ్రామాల రైతుల భూముల ద్వారా, 1.8 కిలోమీటర్ల మేర వచ్చి ముప్పవరం సమీపంలో సాయిబాబా గుడి దగ్గర జాతీయ రహదారిలో కలవనుంది. ఇందుకు సంబంధించి చీరాల ఆర్డీవో సరోజిని ఆధ్వర్యంలో రైతులతో శనివారం ముప్పవరం గ్రామంలోని గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సరోజిని మాట్లాడుతూ, ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం రైతులు ఇస్తున్న భూములకు రిజిస్ట్రేషన్ ధరకు ఒకటిన్నర వంతులు అదనంగా ఇచ్చి, భూములు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఇప్పటికే హైవేకి సంబంధించిన సర్వే పూర్తయిందని ఆమె చెప్పారు. 1.8 కిలోమీటర్ల హైవేకి గాను రైతుల భూములు 29.39 ఎకరాలు, ప్రభుత్వ భూమి 1.63 ఎకరాలు, తీసుకున్నట్లు తెలిపారు. 29.39 ఎకరాల రైతుల భూమికి సంబంధించి, 51 మంది రైతులను అవార్డు విచారణ కింద పిలిపించినట్లు ఆమె తెలిపారు. ల్యాండ్ అక్విజేషన్లో, రైతుల భూముల గట్లు ఎవరివీ తొలగించలేదని, కేవలం కొలిచి రాళ్లు మాత్రమే వేశామని తెలిపారు. భూసేకరణ చట్ట ప్రకారం, బేసిక్ వ్యాల్యూను దృష్టిలో ఉంచుకొని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని, బేసిక్ వ్యాల్యూ ప్రకారం వెలివేషన్ నిర్ణయించడం జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో రైతులకు పాస్ పుస్తకాలు ఉండవని, భూమి హక్కు పత్రాలు మాత్రమే ఉంటాయని ఆర్డీవో తెలిపారు. రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, సర్వేలో రైతులు భూమి వివరాలు పూర్తిగా తెలిసిపోతాయని ఆమె చెప్పారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి రైతులకు చెందాల్సిన డబ్బులను, సకాలంలో చెల్లిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ విషయమై రైతు సంఘం బాపట్లజిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, పలువు రైతు నాయకులు ఆర్డీవోను ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంగులూరు మండల తహశీల్దారు పద్మావతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, పలువురు అధికారులు, వీఆర్వోలు, గ్రామ నౌకర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం రైతులతో సమావేశమై మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సరోజిని

కాలిపోయిన వస్తువులు

అగ్ని ప్రమాదంలో దుకాణాలు దగ్ధం

ప్రజాశక్తి-గిద్దలూరు: పట్టణంలోని రేడియో బావి సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అక్కడ చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న 5 చిరు దుకాణాల బంకులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన వేకువజామున చోటు చేసుకోవడంతో విషయం ఆలస్యంగా తెలిసింది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకునేసరికి జరగవలసిన నష్టం పూర్తిగా జరిగిపోయిందని బాధితులు వాపోయారు. ఈ అగ్ని ప్రమాదంలో టైలర్ షాపు, బైకు మెకానిక్ షాపు, ఇస్త్రీ దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం వల్ల రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వెల్లడించారు. ప్రభుత్వమే తమను ఆదుకొని సహాయం అందించాలని వారు కోరారు.

నేరాల నియంత్రణపై దృష్టి: డిఎస్‌పి

ప్రజాశక్తి-రేపల్లె

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని రేపల్లె డిఎస్‌పి టి మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం రేపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కొత్తగా పోలీస్ సబ్ డివిజన్‌తో తీర ప్రాంతంలో గతంలో కంటే పోలీసు నిఘాను పెంచుతున్నట్లు తెలిపారు. అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలను కూడా నియంత్రించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సముద్ర తీరం, కృష్ణానది పరివాహక ప్రాంతాలలో అక్రమార్కులు విచ్చలవిడిగా సారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారని, వీటిని పట్టణాలకు, గ్రామాలకు పెద్దఎత్తున తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. సబ్ డివిజన్ ఏర్పాటుతో గతంలో కంటే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్ స్థాయి అధికారి స్థానికంగా ఉండడంతో పూర్తి భద్రత భరోసా ప్రజలకు ఉంటుందన్నారు. గ్రేవ్ కేసుల్లో సీఐలు తప్పనిసరిగా సంఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి నివేదికలు తెప్పించడంలో జాప్యం చేయరాదని, ఇదే సమయంలో చార్జ్‌షీటు వేయడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే నిస్వార్థ సేవలు అందించేందుకు పోలీస్ శాఖ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలో లభిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో రూరల్ పట్టణ సిఐలు విజయచంద్ర, శివశంకర్, 9 మంది ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేపల్లె డిఎస్‌పి మురళీకృష్ణ

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కర్లపాలెం

మహిళలు ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కర్లపాలెం ఎంపిడిఓ ఎలీషా బాబు అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్యలో విఓఏల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు మహిళలను లక్షాధికారులను చేసేందుకు ప్రతి క్షణం తాపత్రయ పడుతున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాలు రికవరీ చెల్లింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకులలో నే చెల్లిస్తే ఈ సమస్యలు రావు అని, బిసి పాయింట్‌లో చెల్లించేవారు జాగ్రత్త వహించాలని కోరారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సుస్థిర జీవనోపాధి మెరుగుదలకోసం సబ్సిడీపైన అందించే ఎస్‌సి, ఎస్‌టీల కోసం జగనన్న బడుగు వికాసంతో ఎలక్ట్రికల్ ఆటోలు, కార్లు, లారీలు పొందవచ్చని తెలిపారు. విఓఏలు ఎక్కడైనా గ్రూపుల వద్ద డబ్బులు అడిగినట్లు కంప్లైంట్ వచ్చినట్లయితే తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వం గ్రామ సంఘం సేవలు చేసినందుకు గాను రూ.8 వేల రూపాయలు పారితోషికం ఇస్తున్నటు తెలిపారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిసిలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరరావు, సోమేశ్వరి, మాస లక్ష్మీ, మరియు విఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్లపాలెం ఎంపిడిఓ ఎలీషా బాబు

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాలలకు స్వేచ్ఛ, గౌరవం ఇవ్వాలి

ప్రజాశక్తి-అద్దంకి: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 (ఎఫ్) ప్రకారం స్వేచ్ఛ, గౌరవం, అన్నిటిలో సమాన అవకాశాలు సౌకర్యాలు పొందే హక్కు పిల్లలకి ఉందని, వారి బాల్య దోపిడీకి గురికాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మణికేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని మణికేశ్వరం, విప్పర్ల వారిపాలెం గ్రామంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలు, మరియు అంగనవాడీ సెంటర్లలో బాపట్ల జిల్లా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడారు. మణికేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ రాఘవేంద్రరావు, మణికేశ్వరం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం ప్రియదర్శిని మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్ టీచర్స్ ఎన్ కవిత, లింగమ్మ, విద్యా కమిటీ చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారికి చీరాల అభివృద్ధి అర్థం కాదు: కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

హైదరాబాదు, వైజాగ్‌లో వ్యాపారాలు చేసే వారికి చీరాల నియోజకవర్గ అభివృద్ధి పనులు ఎలా అర్థం అవుతాయని వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బలరాం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వందల కోట్లతో పనులు చేయిస్తుంటే అభివృద్ధి కనిపించటం లేదని వైజాగ్ వ్యాపారస్తుడు మాట్లాడారని, నియోజకవర్గంలో ఉంటే అభివద్ధి అంటే ఏంటో తెలుస్తుందని అన్నారు. నిజమైన అభివృద్ధిని ప్రస్తుతం చీరాలలో ప్రజలందరూ చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ద్వారా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.20.61 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం జరిగిందని అన్నారు. రూ.15.17 కోట్లతో ఆర్అండ్‌బి తారు రోడ్లు నిర్మాణం, జల జీవన్ మిషన్ ద్వారా 50 కోట్ల వ్యయంతో తాగునీటి పనులు, వేటపాలెం మండలంలోని పలు పంచాయతీల అభివృద్ధి పనులకు లక్షల నిధులు ఖర్చు చేయడం జరిగింది అన్నారు. అంతేకాకుండా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.419 కోట్లు మంజూరు చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో జరిగాయని, జరుగుతున్నాయని అన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. రాష్ట్రంలో టిడిపి బతికి బట్టకట్టే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికలలో వైసిపి గెలవడం తథ్యమని అన్నారు. వైసిపి పాలనను చీరాల ప్రజలు విశ్వసిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ వస్తుంది అన్నారు. చీరాలను ప్రశాంత వాతావరణం కనిపిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో వైసీపీనే చీరాల నియోజకవర్గంలో గెలిపించుకుంటారని అన్నారు. అనంతరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను మీడియాకు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కోఆప్షన్ మెంబర్ షేక్ ఫాతిమా, గవిని శ్రీనివాసరావు, షేక్ కబీర్, మొహిద్దీన్ పలువురు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

సైనికుడు శ్రీ హరి బాబుకు అంతిమ వీడ్కోలు పలుకుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) శ్రీహరిబాబు (ఫైల్)

ప్రభుత్వ లాంఛనాలతో సైనికుడి అంత్యక్రియలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన యంపరాల శ్రీహరిబాబు ఇండియన్ ఆర్మీలో హవల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ హృద్రోగ సమస్యలతో ఢిల్లీ లోని ఆర్మీ హాస్పిటల్‌లో మృతి చెందారు. శనివారం హరిబాబు స్వగ్రామం గుడిపూడి గ్రామంలో అంత్య క్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. బాపట్ల నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు, ఆర్మీ బెటాలియన్ నుంచి పార్థివ దేహంతో వచ్చిన హవల్దార్ జయరామ్‌తో తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ సైనిక సంక్షేమ కార్యాలయం నుంచి అందవలసిన సహాయ కార్యక్రమాలు త్వరగా అందే విధంగా చేస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, కృష్ణారావు, బక్కా రామకృష్ణ రెడ్డి, వీరాస్వామి, సర్వింగ్ హవల్దార్ జయరామ్, మాజీ సైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పట్ట పగలు ఇంటి తాళం పగలగొట్టి నగదు చోరీ చేసి పారిపోతున్న అగంతకుడిని అడ్డుకున్న గర్భిణిపై దుండగుడు దాడి చేసి అక్కడి నుండి పారిపోయిన ఘటన మండల పరిధిలోని రాజుపాలెం శాంతినగర్ కాలలో శనివారం చోటు చేసుకుంది బాధితురాలు, స్థానికుల కథనం ప్రకారం.. శాంతినగర్ కాలనీలోని తిరుపతమ్మ గుడి వెనుక వైపు నివాసం ఉండే తన్నీరు లక్ష్మీనారాయణ గత మూడు రోజుల కిందట ఇంటికి తాళం వేసి పని మీద తుళ్లూరు గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం గుర్తుతెలియని అగంతకుడు తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగల గొట్టి ఇంట్లో దేవుడి డబ్బాలో ఉంచిన రూ.18,500 నగదుని అపహరించి ఇంట్లోంచి బయటకు వస్తుండగా అదే సమయంలో పక్కింటిలో ఉన్న గర్భిణి రాజేశ్వరి అగంతకుడిని పట్టుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో రాజేశ్వరిపై దొంగ దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. దొంగ చేతిలో గాయపడిన రాజేశ్వరిని కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కాగా జరిగిన ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని మార్టూరు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు.

జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-చీరాల

మండలంలోని పలు ప్రాంతాలలో చేపట్టిన జగనన్న కాలనీ గృహాల లేఅవుట్లను డిడబ్ల్యుఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్ పరిశీలించారు. శనివారం గృహ నిర్మాణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు పంచాయతీలలో నిర్మిస్తున్న జగనన్న గృహాలను ఆయన విజిట్ చేశారు. చీరాల నగరంలోని జగనన్న కాలనీని పరిశీలించిన అనంతరం తోటవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనుల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పంపించే పలు అంశాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అదేవిధంగా బుర్లవారిపాలెం పంచాయతీలో చేపట్టిన దోమ నర్సరీ పనితీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీలో ఆయన మొక్కలను నాటడంతో పాటు పలు కుటుంబాలకు మొక్కలను పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో దాసు టిపి జయకుమార్, బర్లవారిపాలెం తోటవారిపాలెం ఎఫ్ఏలు పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి నరేంద్రకుమార్

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి-అమృతలూరు

రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను సకాలంలో రైతులకు చేరే విధంగా గ్రామ వ్యవసాయ అధికారులు కృషి చేయాలని అమృతలూరు ఎంపీపీ రావర్ల నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం అమర్తలూరు, చుండూరు రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు ఏడిఏ హెచ్ తిరుమలాదేవి అధ్యక్షత వహించారు. వివిధ పంటలలో రైతులు అవలంబించాల్సిన పద్ధతులను విఏఏలు మరియు వీహెచ్ఏఎల్‌కు ఏడిఏ తిరుమలాదేవి వివరించారు. మెరైన యాజమాన్య పద్ధతులు సర్టిఫికేషన్ అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమర్తలూరు ఏవో వి లోకేశ్వరి, చుండూరు ఏవో బి ఆదంబాబు మాట్లాడుతూ వరి, జొన్న మొక్కజొన్న, అపరాలు వంటల సాగులో రైతులు అవలంబించాల్సిన పద్ధతులను వ్యవసాయ సహాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమృతలూరు, చుండూరు మండలాలకు చెందిన విఏఏలు, ఎంపీఈవోలు, విఏహెచ్‌లు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు

ప్రజాశక్తి-అద్దంకి

జన విజ్ఞాన వేదిక, సమగ్ర శిక్ష అభియాన్, ఆంధ్రప్రదేశ్ సహకారంతో అద్దంకి మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. అద్దంకి రూరల్ స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మాయిపాలెం విద్యార్థులు వై ప్రణీత్ (10వ తరగతి), ఎస్‌వి పార్థసాయి (9వ తరగతి), ఏ తన్మయి (8వ తరగతి) బహుమతులు సాధించారు. విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు కెవి శ్రీనివాసరావు అభినందించారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో ఆవాస్ దివస్‌లో భాగంగా జగనన్న లేఅవుట్లు సొంత నివాస, పీఎంఈవై ఆవాస్ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి సాంబశివరావు కోరారు. శనివారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, తహశీల్దారు వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, రజని, ఏపీవో రమేష్ బాబు, ఏపీఎం వెంకటరావు, గ్రామ సమాఖ్య లీడర్లు లబ్ధిదారులు పంచాయతీ సర్పంచులు పృథ్వీరాజ్, వలేరు రేణుకా బాలకోటేశ్వరరావు, బిఆర్ఓలు సత్యం, జ్యోతిరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల జిల్లా పరిధిలో గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, 21వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకి తరలిరావాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కె పుల్లారావు పిలుపునిచ్చారు. ఈ ధర్నా జయప్రదం కోసం బాపట్ల సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలో గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్మికులకు చాలా చోట్ల 10 నెలలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లా పరిధిలో గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డారు. అప్పులో కూరుకుపోయారు. కావున జిల్లా పరిధిలో వేతనాలు విడుదల కోసం నవంబర్ 21వ తేదీ సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మికులు తరలిరావాలని కోరారు.

మాట్లాడుతున్న మజుందార్

రాష్ట్రంలో 50 వేల మందికి పైగా కార్మికులు పారిశుధ్యం, ఇంజనీరింగ్ వివిధ విభాగాల ద్వారా గ్రామ పంచాయతీలో ప్రజలకు సేవలందిస్తున్నారు. 1999లోనే గుర్తింపు కార్డ్స్, కనీస వేతనాలు, పీఎఫ్, ఇఎస్ఐ అమలు చేస్తామంటూ అప్పటి ప్రభుత్వం జిఓ 551 ఇచ్చింది. కానీ నేటికీ ఆ జిఓ చాలాచోట్ల అమలు చేయడం లేదని అన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులు, టైం స్కేల్ వర్కర్స్‌కు ఉన్న జిఓలు అమలు చేయాలని కోరారు. పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకుండా లేకుండా చేసే టెండర్ల విధానం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు జిఓ 680 ప్రకారం నెలకు రూ.10,000 జీతం చెల్లించాలన్నారు. పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న జిఓ 132, 57 ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం, టెండర్లతో సంబంధం లేకుండా ఉద్యోగాల్లో కొనసాగింపు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఇఎస్ఐ అమలు, జిఓ 142 ప్రకారం పార్ట్ టైం సిబ్బందికి మినిమం టైం స్కేలు ప్రకారం కరవు భత్యం ఇవ్వాలి, గ్రామ పంచాయతీ కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించుకుంటూ సమస్యలు పరిష్కరించడంలో, వేతనాలు ఇవ్వటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

న్యాయస్థాన భవనాలు పరిశీలన

ప్రజాశక్తి-పర్చూరు

న్యాయస్థాన భవనాలు కొద్దికాలానికే శిథిలావస్థకు చేరటం పట్ల హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్ జయసూర్య, డాక్టర్ జస్టిస్ కె మన్మథరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్చూరులో కోర్టు భవనాలను శనివారం న్యాయ మూర్తులు పరిశీలించారు. ప్రైవేటు భవనాలు పటిష్టంగా ఉండగా కోర్టు భవనాలు ఎందుకు ఇలా ఉన్నాయని ఆర్అండ్‌బి డిఇఇ నరసింహులను ప్రశ్నించారు. కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస భవనాలను నిర్మించిన 10 సంవత్సరాలకు దెబ్బతిన్నాయని, మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నామని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి నివాస భవనం, కోర్టు మొదటి అంతస్తు, కొద్ది సంవత్సరాలకే దెబ్బతిన్నాయని చెప్పారు. భవనాల గదులను హైకోర్టు న్యాయమూర్తులు పరిశీలించారు. శ్లాబు పెచ్చులూడి పడటం, శ్లాబుపై నడిస్తే కూలే అవకాశం ఉండటం గమనించారు. ప్రాంగణంలో ఉన్న స్థలంలో కొత్త భవనాలు నిర్మించే అవకాశం ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. జిల్లా జడ్జి ఎ భారతి మరమ్మతుల కోసం రూ.80 లక్షలు అంచనా వేసి

కోర్టు భవనాలు పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

పంపామని వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.కుముదిని, జూనియర్ సివిల్ జడ్జి వి నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రావి సత్యనారాయణ, తులసి రాజేష్, న్యాయవాదులు, బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు, సిఐ ఆంజనేయరెడ్డి, ఎస్ఐ జివి చౌదరి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌డిఓ జి రవీందర్, తహశీల్దార్ నెహ్రూ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉప్పుటూరులోని వెంకటేశ్వర స్వామిని న్యాయమూర్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అద్దంకి

భారత దేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 106వ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా నగర్‌లోని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ తమ పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసి అనేక పథకాలు అమలు చేసిందన్నారు. ఆనాటి రోజుల్లో బ్యాంకులను జాతీయం చేసి ప్రజలకు అనేక సదుపాయాలు కల్పించిందన్నారు. ఆనాటి రోజుల్లో పేదలకు సొంత గృహానికి అవసరమైన వస్తువులను ప్రభుత్వం అందించిందన్నారు పేదలు ఇప్పటికి కూడా ఇందిరా గాంధీని మరువలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్ని మురళీకృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, చుండూరు మురళీ సుధాకరరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, మలాది శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, యు దేవపాలన, వెంపరాల అంజయ్య, తాళ్లూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అడుగడుగునా నీరాజనాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజారంజక పాలన చేస్తున్న జననేత జగనన్నకు అడుగడుగునా నీరాజనాలు వినిపిస్తున్నాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని సింగుపాలెం విశ్వేశ్వరం పంచాయతీలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్దే లక్ష్యంగా జగనన్న ముందుకు

మాట్లాడుతున్న మోపిదేవి

సాగుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజారంజక పాలన చేశారన్నారు. ప్రజల్లో ఒక్కడిగా ఉంటూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రాష్ట్రాభివృద్ధిలో శక్తివంచన లేకుండా పాలన సాగిస్తున్న మహానేత జగనన్న అని కొనియాడారు. పంచాయతీలోని ఒకో గ్రామానికిగాని, పట్టణాలలో ఒకో వార్డుల్లోగాని ప్రజలకు కోట్ల రూపాయల సంక్షేమ లబ్ధి చేకూరటంతోపాటు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జనాలు జననేతకు జేజేలు పలుకుతుంటూ ఓర్వలేని పచ్చనేత పచ్చపాతం కురిపిస్తున్నారన్నారు. తమ మనుగడను కాపాడుకునేందుకు ఉపయోగం లేని కుటిల యత్నాలు చేస్తూ పచ్చనేతల బృందం జనాలలో నవ్వుల పాలవుతున్నారన్నారు. చంద్రబాబునాయుడుకు ప్రజలే మరోమారు బుద్దిచెప్పే రోజులు వచ్చేశాయన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు బురదచల్లే యత్నాలను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆ బురదలోనే కూరుకుపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె వైసిపి మండల రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు ఎంపీపీ పెనుమాల సుశీల వైస్ ఎంపీపీ రావు నెహ్రూ లక్ష్మీ ప్రభాకర్‌రావు, సింగుపాలెం సర్పంచ్ విశ్వేశ్వరం సర్పంచ్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-అద్దంకి

ఎన్టీఆర్ కళాపరిషత్, నందమూరి కళాపరిషత్ అద్దంకి పట్టణ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఏడో రోజు శనివారం అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. వెంపరాల యూపీ స్కూల్ విద్యార్థులు షేక్ జాన్ సాహెబ్ మాస్టర్ బృందం వారిచే ప్రదర్శించిన కోలాట ప్రదర్శన అలరించింది. హెరాల్డ్ ఫైత్ స్కూల్ అద్దంకి విద్యార్థులు పలు సాంస్కృతిక, జానపద, నృత్య రూపకాల ప్రదర్శనలు నిర్వహించారు. డాన్స్ పోటీలు జరిగాయి. సభా కార్యక్రమాలను జ్యోతి రమేష్, అధ్యక్షులు ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీస్ ఐక్యవేదిక, రోటరీ క్లబ్ సింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తేళ్ల అరుణ, డాక్టర్ సిహెచ్ ఫణీంద్రబాబు, డాక్టర్ వివి సుబ్బారావు, జె.సుబ్బయ్య, కందిమళ్ల సాంబశివరావు, గల్లా సాంబశివరావు హాజరయ్యారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు, నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ఆసాంతం దగ్గరుండి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రేక్షకులు, పుర ప్రముఖులచే ఆడిటోరియం కిక్కిరిసిపోయింది.

మహిళల భద్రత కోసం దిశ యాప్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మహిళల భద్రత కోసమే దిశ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని జిల్లా క్రైమ్ డిఎస్పీ జి లక్ష్మయ్య అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం బాపట్ల శాఖ గ్రంథాలయంలో మహిళా దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మెడిటేషన్ ట్రైనర్ మానం మల్లేశ్వరి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 20 నవంబర్ 2022

సబ్ ప్లాన్ నిధులను దళితవాడలకే ఖర్చు చేయాలి..

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ డిమాండ్

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్

ప్రజాశక్తి-టంగుటూరు

ఎస్సి సబ్ ప్లాన్ నిధులను దళితవాడలలోని మౌళిక వసతుల కల్పనకే ఖర్చు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ మండల మహాసభ జరిగిం ది. ఈ సందర్భంగా రఘు రామ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటిన అనేక గ్రామాలలోని దళితకాలనీలు అభివద్ధికి నోచుకోలేదని, దీనికి మన పాలకుల పని తీరే నిదర్శనమన్నారు. దీంతో పాటు ఇప్పటికీ అనేక దళితవాడలో అంటరానితనం, కుల వివక్ష, హత్యలు, అత్యాచారాలు జరుగు తుండడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల కెవిపిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కొల్లాబత్తిన శ్రీనివాసులు, వేశపోగు మోజెస్, సహాయ కార్యదర్శిగా కొమ్ము శ్రీను, ఉపాధ్యక్షుడుగా కె ప్రభుదాసు, కమిటీ సభ్యులుగా కే రమేష్, ప్రవీణ్, కే బ్రహ్మయ్య తదితరులు ఎంపిక య్యారు. మోజస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టి రామా రావు, పి బాబురావు, టంగుటూరి రాము, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడిసిసి నూతన బ్యాంకు ప్రారంభం

ప్రారంభిస్తున్న చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రాష్ట్రంలోనే మొదటి స్థానం లోకి నిలబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తు న్నామని పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదా సి వెంకయ్య అన్నారు. శని వారం శింగరాయకొండ లోని ప్రకా శం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. శింగరాయకొండ పంచా యతీలోని కం దుకూరు రోడ్డులో సోమ రాజు పల్లి వీది . లో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, సీఈవో ఎస్ సత్యవతి ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకంలో పిడిసిసి బ్యాంకు మూడో స్థానంలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పిడిసిసి బ్యాంకులో డిపాజిట్ చేసుకుంటే అధిక వడ్డీ వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వై మోహన్ రావు , సూపం ర్వైజర్ కే మాధవరావు, డైరెక్టర్లు మలి నేని వెంకటేశ్వర్లు ,కొమ్మలపాటి మదన మోహన్ రావు ,గంటా శ్రీనివాసరావు ,జయరామిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాపూరి ప్రభావతి, టెలికం అడ్వైజర్ కమిటీ గూడూరు రవీంద్రబాబు , వైసిపి నాయకులు యన్నా బత్తిన వెంకటేశ్వరరావు , శీలం రాము , ఎస్ కే సలీం భాష , ఎస్ కే పటేల్ , చొప్పర వెంకన్న , కుంచాల రవి ,కుంచాల సాయి వేణు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై నిరంతరం పోరాటం

ప్రజాశక్తి-సిఎస్.పురం.

దళితులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం కెవిపిఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అట్లూరి రాఘవులు తెలిపారు. సిఎస్.పురంలో కెవిపిఎస్ మండల శాఖ సమావేశం పి.రత్నం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కెవిపిఎస్ మూడు లక్ష్యాలతో ఏర్పడిందని, ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు కట్టుబడి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఈ సంఘం ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులు అభివృద్ధి చెందాలంటే అర్హులైన దళితులకే భూమి పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 23న ఒంగోలులో జరిగే కెవిపిఎస్ జిల్లా మహాసభలను, 28, 29లలలో కర్నూలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రభుదాస్, నవీన్, యాకోబు, సంజయ్, విజయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు గూడెలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల చెన్నుపల్లి, దద్దనాల చెంచు గిరిజన గూడెలలో శనివారం పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ రెండు గిరిజన గూడెలలోని చెంచు గిరిజనులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాషా, జానారెడ్డి, మాధవీలత, జ్యోతిరాణి, సుజాత, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

యర్రగొండపాలెం: పట్టణంలోని వినుకొండ రోడ్డులో శనివారం ఎఎస్ఐ మూర్తి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారుల వద్ద వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించారు. అలాగే సరైన పత్రాలతో పాటు హెల్మెట్‌ను కూడా తప్పక వెంట తెచ్చుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్రాలు లేనివారి వద్ద చలానాలు వసూలు చేశారు. ఈ సంధర్భంగా ఏఎస్ఐ మూర్తి మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం మూలంగా ప్రమాదాలలో ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన సర్పంచి



కేపీ కొండారెడ్డితో కర్నాటి

యర్రగొండపాలెం: మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత మార్కాపురం ఎమ్మెల్యే తండ్రి కేపీ కొండారెడ్డిని మొగుళ్లపల్లి సర్పంచి కర్నాటి వెంకటేశ్వరరెడ్డి కలిసి పరామర్శించారు. గతంలో యర్రగొండపాలెం నియో జకవర్గం మార్కాపురంలో ఉండేది. అప్పట్లో ఈ ప్రాం తం నుంచి నాలుగు సార్లు కేపీ కొండారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య కారణంగా కేపీ కొండారెడ్డి ఇంటి వద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా శనివారం కర్నాటి వెంకటేశ్వర్లు కేపీ కొండారెడ్డిని కలిసి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

జగనన్న క్రీడా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - గిద్దలూరు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న క్రీడా సంబరాలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివద్ధి చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కోట్లాది రూపాయల నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నాడని అన్నారు. మూడు రోజులు పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి, వైస్ ఎంపిపి నవల, మున్సిపల్ చైర్మన్ సుబ్బయ్య వారితో కబడ్డీ ఆడి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఎంఇఒ నరసింహులు, విద్యా కమిటీ చైర్మన్ షేక్ గఫూర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర శర్మ, వైస్ ఎంపిపి బండారి నొవెల్, వైసిపి నాయకులు బత్తెం ఓబుల్ రావు, ఎంపిటిసి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి కృషి: బాలినేని

ఒంగోలు సబర్బన్ : ఒంగోలు నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక 11వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రజలకు మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్నీ డివిజన్‌లలో ప్రజా అవసరాలు గుర్తించి వాటిని సమకూర్చడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మల్యాద్రి, డిఇఇ రఘురాం, స్థానిక కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యంతర కమిటీ సభ్యునిగా నాగేశ్వరరావు

నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ :

కేరళ రాష్ట్ర ఫెన్సింగ్ అసోసి యేషన్‌కు మధ్యంతర కమిటీ సభ్యునిగా ఒంగోలుకి చెందిన వి.నాగేశ్వరరావు ఎంపిక య్యారు. మధ్యంతర కమిటీని 6 మంది సభ్యులతో ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నియమించింది. ఈ కమిటీలో ఫెన్సింగ్ అసోసియేషన్ అఫ్ ఇండియా ప్రతినిధిగా ఒంగోలుకు చెందిన వి.నాగేశ్వరరావును ఎంపిక చేశారు. మధ్యంతర కమిటీ కేరళ రాష్ట్రంలోని ఫెన్సింగ్ పోటీలు, కోచింగ్ క్యాంపులు మరియు కేరళ రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనుంది. ఈ సందర్భంగా వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్. దయానంద్ పాటిల్, సెక్రటరీ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రాజీవ్ మెహతా బషీర్ అహ్మద్‌కి కతజ్ఞతలు తెలిపారు.

సిఐ దంపతులను ఆశీర్వదిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్

గృహప్రవేశానికి హాజరైన జడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి-దరిశి

నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న తాళ్లూరుకు చెందిన సిఐ వెంకటేశ్వరరెడ్డి నూతన గృహ ప్రవేశానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. శనివారం తాళ్లూరులో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణవ్రతంలో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు పోశం మధుసూధనరెడ్డి, కోట రామిరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాలినేనిదంపతులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కుమారుడి పెళ్లికి బాలినేనికి ఆహ్వానం

ప్రజాశక్తి-దరిశి

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దంపతులు తన కుమారుడు వివాహ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులకు అందజేసి వివాహానికి హాజరుకావాలని కోరారు. ఆయన వెంట మద్దిశెట్టి రవీంద్ర, తాళ్ళూరు జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు ఉన్నారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణాలు

మంత్రి సురేష్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

నిర్మాణంలో ఉన్న పుల్లలచెరువు-వైపాలెం రోడ్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల మంజూరైన పనుల పురోగతిపై రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులతో సమీక్షించారు. మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం రోడ్ల నిర్మాణం పై దష్టి సారించి వేగంగా పనులు ప్రారంభించారు. మాచర్ల ,శ్రీశైలం రోడ్డు నుంచి పిఆర్సి తండా వయా ఎంద్రపల్లి మీదుగా వెళ్లే రోడ్డు దుస్థితి నుంచి ప్రస్తుతం తారు రోడ్డుగా రూపుదిద్దుకుంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం మంత్రి సురేష్ 60 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులను ఆదేశించడంతో రోడ్డు నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో పిఆర్సీ తండా వెళ్లే గిరిజనుల రాకపోకలకు సౌకర్యవంతంగా రోడ్డు రూపు దిద్దుకుంది. దశాబ్దాల కల నెరవేరింది. ప్రజల ఆంక్షలకు అనుగుణంగా తారు రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధు ల్లేవు. అలాగే త్రిపురాంతకం మండలం సోమేపల్లి గ్రామం అనంతపురం అమరావతి జాతీయ రహదారికి 3.2 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ గ్రామస్తులు దశాబ్దాలుగా మెటల్ రోడ్డుపై రాకపోకలు కొనసాగిస్తూ అవస్థలు పడ్డారు. ఎండ కాస్తే దుమ్ము, వర్షం కురిస్తే బురదలో ఏళ్ల తరబడి నరకం చూశారు. అత్యవసరంగా త్రిపురాంతకం లేదా ఏదైన బయట ప్రాంతానికి వెళ్లాలంటే యాతన అనుభవించారు. ఈ క్రమంలో తారు రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు మార్లు అర్జీలిచ్చినా బుట్టదాఖల య్యాయి. అయితే ఎన్నికల సమయంలో ఆ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి గాను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ 3.2 కిలోమీటర్లు రోడ్డు వేయడానికి రూ.2.14 కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. దీంతో జాతీయ రహదారి నుంచి సోమేపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది.అలాగే పుల్లలచెరువు, యర్రగొం డపాలెం రోడ్డు, మానేపల్లి రోడ్డు మరమత్తులకు రూ.99 లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆ రోడ్ల మరమత్తులు కూడా యుద్ధ ప్రాతిపదిరన పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలు నియంత్రించాలి : సిడిపిఒ

ప్రజాశక్తి-శింగరాయకొండ

బాల్య వివాహాలను నియంత్రించాలని, వీటిపై ప్రజలలో అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిడిపిఒ విజయకుమారి అన్నారు. శనివారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సమగ్ర బాలల పరిరక్షణ పథకం ఆధ్వర్యంలో శింగరాయకొండ షాదీఖానాలో బాల్య వివాహాల నిషేధంపై జరుగుమల్లి, శింగరాయకొండ మండలాలకు చెందిన గ్రామస్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఒ విజయ్ కుమారి మాట్లాడుతూ బాల్య వివాహ రహిత సమాజం మనందరి బాధ్యతని, క్షేత్రస్థాయిలోని సిబ్బంది తమకు కేటాయించిన కుటుంబాలలోని పరిస్థితులను పరిశీలించి ముందుగానే బాల్యవివాహాలను పసిగట్టి వాటిని నిరోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, రిజ్వానా, నాగలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలో వెలుగొండలో వెలసిన వెంకటేశ్వరస్వామిని వైసిపి రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజక వర్గంలో ప్రజలందరూ సుఖశాం తులతో ఉండాలని, రైతులం దరూ సుభిక్షంగా ఉండాలని, 2024లో మరల రెండవసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కావాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లాస్థాయి క్రీడలలో రాణించాలి

ప్రజాశక్తి-దరిశి

జిల్లాస్థాయి క్రీడలలో నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు క్రీడలలో రాణించాలని ఎంపిడిఒ కె కుసుమకుమారి అన్నారు. శనివారం స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ నందు నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె. రఘురామయ్య, పిడిలు సోము అంజిరెడ్డి అనీల్, సాంబశివరావు, కొండలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-కొండపి

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి సిద్ధ వ్యవసాయ రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని (ఏపిసిఎన్ఎఫ్) ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటి మేనేజెడ్ నేచురల్ ఫార్మింగ్ డిపిఎం సుబాషిణి అన్నారు. ఆమె శనివారం మండలంలోని పెట్లూరులో కోటిరెడ్డి అనే యువరైతు సాగు చేసిన ప్రకృతి సిద్ధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అతడు పంటలు ఎలా సాగు చేశాడు. ఏమేమి సాగు చేశాడు పరిశీలించారు. ఎటువంటి పురుగు మందులు వాడకుండా పంటలు పండించే తీరును కోటిరెడ్డి వివరించాడు. తక్కువ ఖర్చుతో అధిక రాబడి సంపాదిస్తున్నట్లు ఆయన అన్నాడు. ఈకార్యక్రమంలో జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ దుగ్గిరాల ఝాన్సిరాణి, మాస్టర్ ట్రైనర్ ఎస్తేరమ్మ, యూనిట్ ఇన్‌చార్జిలు, సురేష్, పెద్దిరాజు, రంజిత్ , ఐసిఆర్‌పిలు, విఏఏ పద్మ పాల్గొన్నారు.

దిశా చట్టంపై అవగాహన కలిగిఉండాలి

దరిశి : దిశా చట్టంపై ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దరిశిలోని సచివాలయం-4 పోలీసు ఎ.నాగ అనిత అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సావాలు సందర్భంగా ప్రశాంతి హైస్కూల్‌లో శనివారం దిశా చట్టంపై మరియు మహిళసాధికారితపై గ్రంథాలయ పాలకురాలు సుమతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు సరస్వతి, శ్రావణి, మాధవి, ఉపాధ్యాయులు కబీర్, లక్ష్మి, పాల్గొన్నారు.

తర్లుపాడు : స్థానిక శాఖాగ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో శనివారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు, స్కిప్పింగ్ పోటీలను గ్రంథపాలకుడు ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎం.నందన, ఉపాధ్యాయులు జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చాకు కార్మికులకు రక్షణ కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-చీమకుర్తి

జిల్లాలో పనిచేస్తున్న పచ్చాకు ముఠా కార్మికులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, రక్షణ చట్టం సాధన కోసం సమైక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక పంగులూరికృష్ణయ్య భవనంలో శనివారం పచ్చాకు పొగాకు ముఠా కూలీలు ,మేస్త్రీలు, టోకర్లు, డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంజా చెన్నయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశలో 130 మిలియన్ కిలోల పైగానే ఉత్పత్తి అవుతుండగా ప్రకాశం జిల్లాలోనే 100కిలోల మిలియన్ కిలోల పైగా ఉత్పత్తి అవుతుందన్నారు. పొగాకు ఉత్పత్తిపై ఆధారపడి దేశంలో నాలుగున్నర కోట్ల మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దేశంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54000కోట్ల అమ్మకం పన్ను రూపంలో ఆదాయం వస్తుందన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఆదాయం రావడానికి కారణమైన రైతులు,కూలీల గురించి పొగాకు బోర్డుకు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదన్నారు. పచ్చాకు పొగాకు కూలీలు అనారోగ్యం పాలవుతున్నా వారిని ఆదుకునేందుకు ఎటువంటి రక్షణ చట్టం లేదని

మాట్లాడుతున్న కంకణాలఆంజనేయులు

ఆవేదన వెలిబుచ్చారు. వీరి రక్షణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు పనిలో అనేక ప్రమాదాలు ఎదుర్కొంటున్నారని, పచ్చాకు ముఠా కూలీల రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం చేస్తున్న పోరాటంలో పచ్చాకు కూలీలు,మేస్త్రీలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వరు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శీలంఆదినారాయణ, ముఠా కూలీలు మేస్త్రులు కొండ్రు అంకయ్య,పంజా పోతురాజు,డి కోటేశ్వరరావు, ఇస్తాలసింగయ్య, మాల్యాద్రి, చెన్నకేశవులు, వేమాకొండయ్య, యలమంద పాల్గొన్నారు.

ఈగలపాడులో ఇంటింటికీ కందుల

సర్పంచి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

పొదిలి : మండలంలోని ఈగలపాడు గ్రామంలో శుక్రవారం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఇంటింటికీ కందుల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై సంక్షేమం పేరుతో అనేక భారాలు మోపుతోందన్నారు. టిడిపి హయాంలో పంటలు నష్టం వచ్చినప్పుడు ముఖ్యంగా రైతులకు పంటల భీమా డబ్బులు వెంటనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్‌పిటిసి కాటూరి వెంకట నారాయణ బాబు (పెద్దబాబు), పొదిలి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుద్దూస్, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నప రెడ్డి, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్

కందుల, కాటూరికి స్వాగతం పలుకుతున్న సర్పంచి దంపతులు

(పండు), క్లస్టర్ ఇన్‌ఛార్జి కుందూరు కాశి రెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు, శివాలయం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ శామాంతపూడి నాగేశ్వరావు, నాయకులు జ్యోతి మల్లికార్జున రావు, షేక్ కాలేషా, ముల్లా రబ్బానీ, ముని శ్రీను, కుంచేపల్లి యేసు, ఈగలపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటి రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రెడ్డి, కొండాయపాలెం సర్పంచ్ సుబ్బారావు, ముని శ్రీను, వివిధ గ్రామాల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉడుముల వైద్యశాలను సందర్శించిన జానారెడ్డి

పొదిలి : ఇటీవల పొదిలిలో నూతనంగా కార్పొరేట్ తరహాలో అన్నివసతులతో నిర్మించిన ఉడుముల హస్పిటల్స్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి కుందూరు జానారెడ్డి శనివారం సందర్శించారు. ఒంగోలులో ఒక ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కెపి కొండారెడ్డిని పరామ ర్శించేందుకు వెళ్తూ మార్గమధ్యంలో ఉడుముల హాస్పట ల్‌కు సందర్శిం చారు. అనంతరం జానారెడ్డిని ఉడుముల హస్పిటల్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, ప్రకాశం జిల్లా ప్రజా పరిషత్ మాజీ ఛైర్మన్ ముక్కు కాశిరెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉడుముల వైద్యశాల యాజమాన్యం ఉడుముల ఆశోక్ రెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి, మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ చిన వెంకట

జానారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

రెడ్డి, కొనకనమిట్ల ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపిపి ఉడుముల రాంనారాయణ రెడ్డి, కెకెమిట్ల వైసిపి కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, ఉడుముల గురవారెడ్డి, సిసికెఆర్ శ్రీనివాస రెడ్డి, మంగాపురం ఉప సర్పంచి బేతా ప్రకాశ్ రెడ్డి, ఫకీర్ రెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బోధనంపాడులో ప్రజాభిప్రాయ సేకరణ

కురిచేడు: బోధనంపాడులోని సర్వేనెం.227లోని కొండను వైట్ క్వార్జ్ తవ్వకాల కోసం అమరం కమోడిటీ వెంచర్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా శనివారం గ్రామంలోని ప్రజల అభిప్రాయ సేకరణకు కనిగిరి ఆర్‌డిఒ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ గొర్రెలు మేపుకోవడానికి ఇదొక్కడే ప్రదేశమని, మైనింగ్ ద్వారా ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని వారు ఆర్‌డిఒకు వెల్లడించారు. దానిపై ఆ సంస్థ యాజమాన్యం పర్యావరణానికి ఎటువంటి హాని జరుగకుండా మైనింగ్ జరుపుకుంటామని, వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఒ నాగుల్ మీరా, జడ్‌పిటిసి వెంకటనాగిరెడ్డి, మాజీ ఎంపిపి వీరగంధం కోటయ్య, వైకాపా నాయకుడు నుసుం ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకూ..

శింగరాయకొండ: ప్రతి సమస్యను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని కొండపి వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం శింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామపంచాయతీలోని అంబేద్కర్ నగర్. ఆది ఆంధ్ర కాలనీ . పెద్ద కనుమళ్ల లోని ఎరుకుల కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి తెలుసుకునేందుకు. ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంటు వైద్య విభాగమ అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి ,ఎంపీపీ కట్ట శోభారాణి , సొసైటీ ఛైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు ,వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

గిద్దలూరు రూరల్ : గిద్దలూరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జీసస్‌హెులి చర్చ్ ఆధ్వర్యంలో గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న 200 మందికి శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. గిద్దలూరు పట్టణం రైల్వేస్టేషన్ ఆవరణలో ఎస్ఐ బ్రహ్మనాయుడు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ జడ్. చంద్రశేఖర్, ట్రెజరర్ జి.జాషువా పాల్గొన్నారు.

టాయ్‌లెట్స్ వినియోగించుకోవాలి

దొనకొండ : బహిరంగ మల విసర్జనను మానివేసి, అందరూ టాయ్‌లెట్స్‌ను వినియోగించాలని ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వసంతరావునాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని కార్యదర్శులు, సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ మాట్లాడుతూ బహిరంగ మల విసర్జనను నివారించేందుకు అంతర్జాతీయంగా టాయిలెట్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపరిండెంట్ దావూద్, ఇఒఆర్‌డి డేవిడ్, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు యం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రిజిస్టార్ కనకదుర్గారావు

ఆర్థిక అభివృద్ధే ధ్యేయం

మద్దిపాడు : సహకారం సంఘము సభ్యుల ఆర్థిక అభివద్ధే మా ప్రధాన ధ్యేయమని నందిపాడు సహకార సంఘము అధ్యక్షులు పునాటి వెంకట అప్పారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయం నందు రాష్ట్ర సహకార వారోత్సవాలు కార్యక్రమం అప్పారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి డిప్యూటీ రిజిస్టార్ ఎం. కనకదుర్గరెడ్డి మాట్లాడుతూ సంఘము సభ్యుల సహకారంతో అన్ని విధాలా ఆబివృద్ధి చెందుతున్నామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ ఎన్, కష్ణ. మరియు సొసైటీ కోర్డానేటర్ టీ. శ్రీనివాసులు సొసైటీ సభ్యులకు 100మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసారు

రోడ్డు మరమ్మతులు చేయాలని వినతి

పొన్నలూరు : పొన్నలూరు నుండి ఇప్పగుంట, పెద్దవెంకన్నపాలెం రోడ్డు మరమ్మత్తులు చేయాలని పంచాయితీరాజ్ ఎఇకి జనసేన ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి గుంతలమయమైన రోడ్డు కారణంగా రోజుకు ఒకటి రెండు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇకనైనా అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.

సీనియర్ జర్నలిస్టు రుషేంద్ర మృతి

కొత్తపట్నం: కొత్తపట్నం మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయులు చినిగే రుషేంద్ర రెడ్డి అనారోగ్యంతోమృతి చెందారు. గత నెల రోజుల నుండి తీవ్ర అస్వస్థత కు గురై శనివారం తెల్లవారుజామున మరణించారు. అతని మతికి మండల విలేకరుల యూనియన్ సంతాపం తెలియజేస్తూ అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పఠనాసక్తి అలవరచుకోవాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రతి తరగతిలో ప్రతి అంశంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రంథాలయ పాలకురాలు అంబటి శకుంతలాదేవి విజేతలకు విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ ఈ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని, పఠనాశక్తి పై దృష్టి కేంద్రీకరించడానికి ఈ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. విద్యార్థులు ప్రతి నిత్యం అర్థగంటసేపు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎం సీతారామరెడ్డి, పాఠశాల సిబ్బంది భవనం శివలీల, పెంట్యాల పావని, అంబటి సురేష్, బండారు అనిల్ కుమార్, వసంత రఘుబాబు, సిహెచ్ శ్రీవిద్య లక్ష్మి, పెండ్యాల రాధిక, గోరంట్ల సంధ్యారాణి, అంబటి అపర్ణ, కంబాలపాటి నర్సయ్య పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం బాపట్ల మండలంలోని బేతపూడి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా 5వ రోజు ఉచిత పశువైద్య సేవను అందించారు. పశువైద్య నిపుణులైన కె విజయ ప్రకాష్ బి గోపికృష్ణ గేదెలు, ఆవులు, మేకలు, కుక్కలు మొదలగు వాటికి వైద్య సేవలు అందించారు. కళాశాల అసోసియేట్ డీన్ జాన్ వెస్లీ సూచనల మేరకు ప్రొఫెసర్లు విమలబీర, శ్రీనివాస్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: సిఐ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇంకొల్లు సిఐ బి సూర్యనారాయణ సూచించారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చట్టాలు, పోలిసింగ్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజంలో బాధ్యతగా మసలుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలల బాల బాలికల నుంచి సందేహాలను అడిగి నివృత్తి చేశారు. ఇంకొల్లు ఎస్సై షేక్ నాయబ్ రసూల్ ముఖాముఖి కార్యక్రమం పోలీసులు ప్రజలకు అండగా ఉండే విధానం గురించి, బాలబాలికలపై జరిగే నేరాలకు పోలీసులు స్పందించే విధానం గురించి, వాటికి న్యాయం చేకూరించే చట్టాలు గురించి వివరించారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ గౌతమి జూనియర్ కాలేజీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లులోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జూనియర్ అండర్-19 బాల బాలికల జట్టు ఎంపిక జరిగింది. ఇంకొల్లు గౌతమి కళాశాలకు చెందిన జి అనిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టులో స్థానం సంపాదించాడు. ఈ నెల 22,23,24 తేదీలలో విశాఖ జిల్లా అనకాపల్లి రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా శ్రీ గౌతమి జూనియర్ కాలేజ్ డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎస్కె మోబిన్, జి వెంకట్రావు, జి నాగలక్ష్మి, పీడీ పిచ్చయ్య, కాలేజీ బృందం విద్యార్థిని అభినందించారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు ఈ ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టియూ బాపట్ల జిల్లా జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చాక మూడేళ్ల నుంచి డీఏ లేదన్నారు. ప్రభుత్వంలోకి వచ్చాక సీపీఎస్ వారంలో రద్దు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆ అంశాన్ని పక్కన పెట్టేశారన్నారు. పిఎఫ్, ఏపిజిఎల్ఐ డబ్బులు వాడేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. తాము దాచిన డబ్బులు తాము డ్రా చేసుకోవాలన్నా రాని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పీఆర్సీలో అన్యాయం జరిగింది. సబ్జెక్ట్ టీచర్లకు ప్రమోషన్లు ఇస్తానని ఇంత వరకు ఇవ్వలేదు. పై డిమాండ్లను సాకారం చేయకపోతే ఎస్టీయూ తరఫున అన్ని సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున పోరాటాలు చేయవలసి వస్తుందని అన్నారు.

వంటశాలలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజన వంటశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కెజిఎస్ ప్రగతి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం సంతమాగు లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఉన్నత పాఠశాలలో 439 మంది విద్యార్థులకు గాను 350 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, 180 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అందులో 120 మంది విద్యార్థులు బీసీ, ఎస్సీ హాస్టల్ విద్యార్థులని, 60 మంది విద్యార్థులు మాత్రమే రెగ్యులర్ విద్యార్థులని ప్రధానోపాధ్యాయులు డైరెక్టర్‌కు తెలిపారు. మిగతా విద్యార్థులు కూడా భోజనం తినేటట్లుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. కోడిగుడ్లు దుర్వాసన వస్తున్నాయని, అందుకే మధ్యాహ్న భోజనం తినడం లేదని కొందరు విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన గుడ్లు అందించాలని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఏల్చూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ వంటగదిలో ఉన్న కోడిగుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందిస్తున్న తీరుపట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, దారా బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కాకతీయ సొసైటీ చైర్మన్ లక్ష్మీ కాంతారావు

ప్రజాశక్తి-రేపల్లె

21 సంవత్సరాల క్రితం స్థాపించబడి ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ది కాకతీయ మ్యూచువల్ ఎయిడెడ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ సభ్యులకు ఖాతాదారులకు విలువైన సేవలు అందిస్తూ లాభాల బాటలో నడుస్తోందని సొసైటీ చైర్మన్ లక్ష్మీ కాంతారావు అన్నారు. రేపల్లె పట్టణంలో కాకతీయ సొసైటీ 5వ బ్రాంచ్‌గా స్థాపించబడి, ఐదు వసంతాలు పూర్తి చేసుకుని 6వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా చైర్మన్ లక్ష్మీ కాంతారావు అధ్యక్షతన పంచమ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో స్థాపించబడిన తమ బ్రాంచ్ ఇప్పటివరకు రూ.10.10 కోట్లు ఖాతాదారుల నుంచి డిపాజిట్లు స్వీకరించి అతి తక్కువ వడ్డీతో సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు హామీ పైన, వ్యక్తిగత జామీనుపైన 15 శాతం వడ్డీపై అప్పులు ఇస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయత భద్రత పారదర్శకత సంస్థ లక్ష్యంగా పని చేస్తున్నదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ గ్రంధి చంద్రమౌళేశ్వరరావు మాజీ కౌన్సిలర్ షేక్ జమీర్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్ బ్యాంకు లీగల్ అడ్వైజర్ వీరరాఘవయ్య, తెనాలి సెక్రటరీ ఝాన్సీ లక్ష్మీ బ్రాంచ్ మేనేజర్ మదన్, కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు కెనరా బ్యాంక్ చేయూత

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టాలని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ జీఆర్‌పి గాయత్రి అన్నారు. కెనరాబ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆంధ్రరత్న ఉన్నత పాఠశాలలో తమ విద్యలో ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థునులకు కెనరా విద్యా జ్యోతి స్కీమ్ కింద నగదు బహుమతులను అందించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో కెనరా బ్యాంకు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు బి సల్మాన్‌రాజు పేర్కొన్నారు. విద్యార్థినులకు కెనరా బ్యాంక్ విద్యా జ్యోతి పథకం కింద స్కాలర్‌షిప్‌లను మేనేజర్ల చేతుల మీదుగా అందజేశారు. మొత్తం 5 మంది విద్యార్థినులకు కలిపి రూ.5 వేల మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కెనరా బ్యాంక్ విద్యా జ్యోతి పథకం కింద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 10 వ తరగతి చదువుతున్న ప్రతిభ కలిగిన ఎస్సీ, ఎస్టీల బాల బాలికలకు రూ.2,500 నుంచి రూ.25,000లను చెక్‌ల రూపంలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్లు ఎస్ఆర్‌కె ప్రసాద్, ఏ ఈశ్వర ఫణి శ్రీనివాస్, స్టాఫ్ గుప్త, రాజేంద్రప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

నెహ్రూ యువకేంద్ర ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఇంకొల్లు మారుతీ ఐటిఐ కళాశాల ఆధ్వర్యంలో మాజీ భారతప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి కళాశాల డైరెక్టర్ కారుమూడి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ సమైక్యత దినోత్సవం ఆమె గౌరవార్థం జాతి లేదా మతంతో సంబంధం లేకుండా భారతీయులందరినీ ఏకీకతం చేయడానికి ప్రోత్సహించే మార్గంగా రూపొందించబడిందని శ్రీనివాసరావు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు, కళాశాల అధ్యాపక బృందం, నాగరాజు, రాఘవ, సుధాకర్, ప్రసాద్, రాజు, మరియదాసు పాల్గొన్నారు.

పర్చూరు: 20 సూత్రాల పథకం అమలు చేయటం, బ్యాంకుల జాతీయకరణ, పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని పిసిసి సభ్యులు తోట శివనాగేశ్వరరావు అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని పర్చూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరా కాలనీలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యార్లగడ్డ రమేష్, పులిపాటి రవి, సంపత్‌కుమార్, అహ్మద్‌ఆలీ పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు గవర్నమెంట్ జాబ్స్‌కు అవసరమైన కోచింగ్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ బండ్ల అంకయ్య తెలిపారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు ఉచిత ట్రైనింగ్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ళ పూర్తి చేసుకొన్న సందర్భంగా ఉచిత శిక్షణతో మరో అడుగు ముందుకేసినట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు సక్సెస్ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడూరి ఏకాంబరేశ్వరబాబు, బండ్ల శరత్‌బాబు, గొల్లపూడి సీతారాం, చిలంకూరి ప్రకాష్, చుండూరి వెంకట రమణ, కొత్త శ్రీనివాసరావు, పత్తి వెంకట సుబ్బారావు, బట్టా మోహన్‌రావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కారంచేడు

జాతీయ ఆవాస్ దివస్ సందర్భంగా శనివారం దగ్గుబాడులో మండల స్పెషల్ ఆఫీసర్ రామారావు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. నిర్మాణంలో ఉన్న కొన్ని ఇళ్లను ఆయన పరిశీలించారు. సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, పంచాయతీ కార్యదర్శి కట్ట జోష్ణ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-రేపల్లె

ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 నుంచి 21 ఏళ్లలోపు యువతను గుర్తించి ఓటు నమోదు చేసేందుకు 19,20 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రేపల్లె నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, కాబట్టి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గాని బూత్ లెవెల్ అధికారుల వద్ద గాని నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో సవరణ చేసుకోవడానికి అవకాశం ఉందని ఆర్‌డిఓ తెలిపారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సంతమాగులూరు

విద్యార్థినులు దిశ చట్టంపై అవగాహన పెంచుకోవాలని గ్రంథ పాలకులు బాదం విజయభాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భారతరత్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జమ్ముల నాగరాజు, గ్రామపెద్దలు, ఆయా పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన అండర్-19 బాలబాలికల జట్ల ఎంపికలో అద్దంకి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మాయపాలెం విద్యార్థులు ఎస్‌కె షారూఖ్, (9వ తరగతి), ఏ పవన్ కార్తీక్ (9వ తరగతి) ఎంపికయ్యారు. ఈ నెల 22, 23, 24, తేదీలలో అనకాపల్లిలో జరిగే రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ స్టేట్ మీట్‌లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు కెవి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు స్టేట్ మీట్‌కు ఎంపిక కావడంపట్ల ప్రధానోపాధ్యాయులు కెవి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీమతి టి శారద, పిఈటి యు రవి అభినందించారు.

ఉత్సాహంగా న్యాయవాదుల వన సమారాధన

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓల్డ్ టౌన్ రాచూరి జమీందారు కోటలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జ్ టి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్ కుమార్ ప్రారంభించారు. న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు కుటుంబ సభ్యులతో వన సమారాధనలో పాల్గొన్నారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో వన సమారాధన కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాచూరి జమీందారు కోటలో ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి వడ్లమూడి ఉదయ ప్రసాద్ అధ్యక్షత వహించారు.

పీఎంఏవై గృహ నిర్మాణం సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం

ప్రధానమంత్రి ఆవాస యోజన పీఎంఏవై గృహ నిర్మాణ కార్యక్రమం లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని అవగాహనా కార్యక్రమం ర్యాలీ ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథ్ బాబు అధ్యక్షతన చేపట్టగా మండల ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ జేడీ పి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మోపిదేవి హరనాథ్‌బాబు మాట్లాడుతూ లబ్ధిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని పక్కా గృహ నిర్మాణాలు అందరూ చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తహసీల్దార్ ఎమ్ శిరీష, ఎంపీడీఓ నర్రా నాగలక్ష్మి, హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

భైరవకోనలో ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు, జేసీ, సబ్‌కలెక్టర్

భైరవకోనలో కలెక్టర్ల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కార్తీకమాసం సందర్భంగా ప్రకాశం జిల్లా, భైరవకోనలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఎఎస్.దినేష్‌కుమార్, విజయకృష్ణన్, ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేదు మాధవన్‌లు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలపాతాన్ని వీక్షించి అక్కడి నుండి కాలభైరవేశ్వరుడుని, త్రిముఖ దుర్గా అమ్మవారిని, శివలింగాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజాలు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఆలయ ఇఒ నారాయణరెడ్డి కలెక్టర్లను ప్రత్యేకంగా ఆహ్వానించి.. వారికి మేళతాళాల నడుమ పూలమాలలతో ప్రత్యేక పూజలు చేయించారు. వీరి వెంట వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళావందనం, జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్ బాలకిశోర్, జిల్లాలోని తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిబి సరళ రుణకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రారంభిస్తున్న ఛైర్మన్ రాకేష్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో సరళ రుణ కేంద్రాన్ని బ్యాంక్ ఛైర్మన్ రాకేష్ కశ్యప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో ఖాతాదారుల సమావేశం, రుణ వితరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. రీజనల్ మేనేజర్ హేమలత మాట్లాడుతూ ఎస్‌ఆర్‌కె (సరళ రుణ కేంద్రం) ద్వారా బ్యాంకు రుణాలు త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

సిఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా

ప్రజాశక్తి-గిద్దలూరు

మాట్లాడుతున్న అన్నా రాంబాబు

సిఎం జగన్‌మోహన్ రెడ్డిపై, పోలీసు అధికారులపై చంద్రబాబు నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే స్థానిక నివాసంలో శనివారం సాయంత్రం మాట్లాడారు. 40 సంవత్సరాలకు పైగా రాజకీయ అనుభవం ఉండి కూడా రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రిని ఇలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా చంద్రబాబు విమర్శలు మానుకుని అబివద్ధి అవుతున్న రాష్ట్రాన్ని చూసి సంతోషించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ ఛైర్మన్లు ఆర్డి రామకష్ణ, కాతా దీపికా, కో ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి,మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, వైసీపీ నాయకులు బత్తెం ఓబులరావు, పాముల శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

మార్కాపురం ఎమ్మెల్యే కుందురు

ప్రజాశక్తి-మార్కాపురం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందురు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కర్నూలులో జరిగిన సభలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఏకవచనంతో, తీవ్ర పదజాలంతో మాట్లాడటాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కుం దురు నాగార్జునరెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మార్కాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కాపురంలో టిడ్కో ఇల్లు ఎలా నిర్మిస్తున్నారో వచ్చి చూసుకోవాలన్నారు. సిఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైసిపి నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చిచ్చుపెట్టడమే చంద్రబాబు నైజం

- ప్రతిపక్ష నాయకుడంటే ప్రజలకు అండగా ఉండాలి

- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బూచేపల్లి వెంకాయమ్మ

చిచ్చుపెట్టడమే చంద్రబాబు నాయుడు నైజమని, పచ్చగా ఉంటే ఓర్వలేనితత్వమని జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షురాలు బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. శనివారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబరులో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కర్నూలు పర్యటనలో చంద్రబాబు మాటలు చూస్తుంటే ఇతను కూడా ప్రతిపక్ష నాయకుడేనా అన్న అనుమానం నేడు ప్రజల్లో కలుగుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుడంటే అను నిత్యం ప్రజలకు అండగా ఉంటారని, లేనివి కల్పించుకుని కుర్చీ కోసం పాకులాడుతూ తప్పుడు ఆరోపణలు చేయరన్నారు. వైసిపి నాయకులను రౌడీలని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, చంద్రబాబు కంటే పెద్ద రౌడీ ఈ రాష్ట్రంలోనే లేరన్నారు. వంగవీటి మోహనరంగాను, కర్నూలులో పత్తికొండ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డిని దారుణంగా హత్య చేయించింది ఎవరనేది రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ తాను అధికారంలోకి వస్తే ఏం చేస్తారనేది ఎవరైనా చెబుతారన్నారు. చంద్రబాబు నాయుడు మాత్రం వైసిపి వారిని బట్టలూడదీసి కొడతా అంటున్నారంటే అతను వీధి రౌడీకి సరిపోతారే తప్ప రాష్ట్ర పాలకునిగా పనికి రారన్నారు. చంద్రబాబు చేష్టలకు తగ్గట్లే ఆయన కొడుకు లోకేష్ కూడా చిన్నాపెద్ద తేడా లేకుండా మాట్లాడుతున్నారని, ప్రజలు వీరిద్దరినీ రాజకీయాల నుంచి శాశ్వతంగా సాగనంపేందుకు సిద్ధం కావాలన్నారు. రాజకీయంలో హుందాతనం ఉండాలని.. ఇటువంటి వారు 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర అంటుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. చంద్రబాబు చరిత్ర మొత్తం రక్తసిక్తమని విమర్శించారు. ఏ సంబంధం లేకపోయినా ఎక్కడో చనిపోయిన విద్యార్థిని విషయం తమకు ఆపాదించి.. పార్టీలో చేరలేదని స్వర్గీయ బూచేపల్లి సుబ్బారెడ్డిపై అక్రమ కేసులు పెట్టిన ఘనులు చంద్రబాబు, లోకేష్ అని విమర్శించారు. పాలన అంటే ఏంటో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలన్నారు చంద్రబాబుకు 2024లో రాజకీయ చిరునామా కూడా ఉండదని బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం

బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మార్టూరు మండల పరిధిలోని డేగరమూడి గ్రామం లోని జగనన్న కాలనీని అధికారులతో కలిసి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న గృహాలను డిసెంబర్ నెలలో లబ్ధిదారులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డేగరమూడి జగనన్న కాలనీలో మంజూరైన 26 గృహాలకు సంబంధించి కేవలం ఆరు గృహాలు మాత్రమే పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరుపుకోగా మిగతా 20 ఇళ్లు అసంపూర్తిగా ఉండటం పట్ల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కలెక్టర్ నిలదీశారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ రవీంద్ర, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, హౌసింగ్ డీఈ మురళి, తహశీల్దారు వెంకట శివరామిరెడ్డి, ఎంపిడిఒ గరికపూడి నితిన్, సర్పంచి జంపని అంజమ్మ వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

జగనన్న క్రీడా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

కబడ్డీ ఆడుతున్న వరికూటి

మండలంలోని మూల గుంటపాడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సిఎం కప్ సెలక్షన్స్, జగనన్న క్రీడా సంబరాలు మొదల య్యాయి. ఈ క్రీడా సంబరాలను కొండేపి వైసిపి ఇంచార్జ్ వరికూటి అశోక్‌బాబు ప్రారంభించారు. ముందుగా క్రీడలను ప్రారంభించి.. అనంతరం సభలో మాట్లాడారు. క్రీడాకారులతో కలిసి వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో కొండపి ఎండిఒ ఎల్ బ్రహ్మయ్య, సీఎం కప్ కోఆర్డినేటర్ చిరంజీవిరెడ్డి, అశోక్‌బాబు, మోహన్‌రావు, ఎంపీపీ కట్ట శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సదస్సులో పాల్గొన్న మేయర్, కమిషనర్

ఒంగోలు నగరపాలక సంస్థ నూతనంగా అభివృద్ధి చేసిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌పై కార్పొరేటర్లకు అవగాహన సదస్సు శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగింది. నగర ప్రణాళిక విభాగం అధికారులు నూతన మాస్టర్‌ప్లాన్‌లోని ముఖ్యమైన అంశాలను కార్పొరేటర్‌లకు వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటిప్లానర్ కె వెంకటేశ్వర్లు, నగరంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'ఇళ్ల'పై రాజకీయ రచ్చ

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణాల అంశం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వేడిని రగిల్చింది. కాలనీల నిర్మాణాలు, ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణాలు పలు కారణాలతో అరకొరగా సాగుతున్న క్రమంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. జనసేన పార్టీ వారు జగనన్న కాలనీల సందర్శనలు జరిపి.. కాలనీల్లోని డొల్లతనాన్ని బహిర్గతం చేశారు. కొన్ని ప్రాంతాల్లో విమర్శల పర్వం ఘర్షణపూరిత వాతావరణానికి కారణమైంది. ఒంగోలులో జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల విషయంలో అటు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఇటు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ల మధ్య తీవ్రస్థాయి వాదనలకు దారితీసింది. కాగా జగనన్న కాలనీల ప్రారంభోత్సవ గడువు డిసెంబరు 21గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు, లబ్ధిదారులపై ఒత్తిడి పెంచారు. అన్ని శాఖల అధికార యంత్రాంగం పక్కాగృహాల నిర్మాణాలపై దృష్టి పెట్టారు. జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. కానీ పక్కా గహ నిర్మాణాలలో ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాపరిషత్ సమావేశాలు వాడివేడిగా జరిగాయి. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలో, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలు గుంటూరు జిల్లాలో ఉన్నాయి. గుంటూరు జిల్లాపరిషత్ సమావేశంలో ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది లేని విషయం, అరకొరగా ఉన్న వైద్యసేవల విషయమై సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశానికి జిల్లా అధికారులు గైర్హాజరు పట్ల ఎంపిపి, జడ్‌పిటిసిలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు జిల్లాలోని విద్యాశాఖ అధికారుల తీరును ప్రశ్నించారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ శాఖ వసతిగృహాలలో కనీస వసతులు లేని విషయమై అధికారులు, ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు.

ప్రకాశం జిల్లా పరిషత్ సమావేశంలో కూడా పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఇరిగేషన్ అధికారుల తీరును దుయ్యబట్టారు. వేలాది ఎకరాలకు సాగునీరందించే గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణ తీరుపై తమ అసంతృప్తి వెలిబుచ్చారు. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వాలని కోరారు. ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలని, గ్రామాలకు తాగునీరందించే పథకాల గురించి అధికారులు పట్టించుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల పరిశీలనలో నియమనిబంధనలు సక్రమంగా పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఓటు హక్కు కోసం ఈ సారి అందరూ నూతనంగా తమ ఓట్లను నమోదు చేసుకోవలసి వచ్చింది. ఈ ఓటు హక్కు కోసం పట్టభద్రులు అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో అధికార పార్టీ నేతలు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఓట్ల చేర్పింపులు జరిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఓట్ల దరఖాస్తులను బిఎల్‌వోలు పరిశీలించి.. ఓటు నమోదు జరపాలి. కానీ బిఎల్‌వోలు అందరికీ ఫోన్లు చేసి.. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని కార్యాలయాలకు రావాలని చెప్పారు. అధికారులు, బిఎల్‌వోల మధ్య సమన్వయ లోపం కారణంగా పట్టభద్రులు ఓట్లను కోల్పోయే పరిస్థితి తలెత్తింది.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 2023 ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. కొత్తగా ఓట్ల నమోదు కోసం డిసెంబరు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. నూతనంగా ప్రచురించిన జాబితా ప్రకారం బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 12,61,287 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో మహిళా ఓటర్లు 6,43,949 మంది కాగా, పురుష ఓటర్లు 6,17,264 మంది.. ఇతరులు 74 మందిగా ఉన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం.

బాపట్ల జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ తరలింపులకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా అధికారులు పిడి చట్టం కింద నమోదు చేసి జైలుకు పంపే చర్యలకు శ్రీకారం చుట్టారు. బాపట్ల జిల్లా ఏర్పడి నప్పటినుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 111 (6ఏ) కేసులు నమోదు అయ్యాయి. 4162 క్వింటాళ్ళ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 62 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ అధికార పార్టీ నేతల అండగా భారీ ఎత్తున పేదల బియ్యం అక్రమంగా తరలిపోతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా రేషన్ బియ్యం దందాకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై పీడీ యాక్ట్ పెట్టే కఠినచర్యలకు జిల్లా అధికారులు పూనుకున్నారు.

మల్లవరం వద్ద ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టును ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు సందర్శించి ఇటీవల వరదనీటి ఉధతికి కొట్టుకుపోయిన గేటు మరమ్మత్తు పనులను పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల తాగు, సాగు అవసరాలు తీర్చే నీరు సముద్రం పాలయ్యాయనిఉమ్మడి ప్రకాశం జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం గేటు విరిగినా.. నేటికీ గేటు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమన్నారు. 3 టీఎంసీలు నిల్వ ఉండాల్సిన ప్రాజెక్టులో 1.7టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండటంతో ఈ ప్రాజెక్టు దిగువలో 80 వేల ఎకరాలకు పైగా ఉన్న గుండ్లకమ్మ ఆయుకట్టు పరిధిలో మిర్చి, పొగాకు, మొక్కజొన్న సాగు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రాజెక్టులు పర్యవేక్షణ నోచుకోలేదు. మూడు గేట్లు పెట్టలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు ఎలా కడతాడని టిడిపి ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

ప్రేమించుకున్న యువతీయువకులు పెద్దలను ఒప్పించి.. పెళ్లి చేసుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అద్దంకిలో ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమికులు వేరువేరు సామాజిక వర్గాలకు చెందినవారు కావడంతో పెద్దలు వారి పెళ్ళికి అంగీకరించలేదు. దీంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చినగంజాంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన యవతీయువకులు ప్రేమించుకున్నారు. పెద్దలు వారి పెళ్ళికి అంగీకరించకపోవడంతో పురుగుమందు తాగి వారు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిద్దరి పెళ్ళికి ఆర్థికపరమైన అంతరాలు అడ్డుగా నిలిచాయి.

- బాపట్ల జిల్లా